కథా నిలయం
1575
శ్రీకాకుళం

# అందరూ దొంగలే

నిజామాబాద్ పట్టణంలో ఒకమూల... ఈ మధ్యనే... అంటే ఒక మూడు సంవత్సరాల క్రితం ప్రారంభించిన హోటల్ 'రాజ్ కాంటినెంటల్' నుంచి నిన్నరాత్రి ఒక ఫోన్‌కాల్ వచ్చింది. ఇంకో కాల్‌కూడ ఈ ఉదయం వచ్చింది. అదే మనిషి మధ్యాహ్నం కూడా ఫోన్ చేశాడు. ఆ హోటల్‌కు తాను ఒకసారి వెళ్ళాలని, అక్కడ విచిత్రమైనవి ఏవో జరుగుతున్నాయని ఆ అజ్ఞాత మిత్రుడు ఇన్నిసార్లు దూరశ్రవణ యంత్రం ద్వారా తెలియజేశాడు. పేరడిగితే అతను చెప్పలేదు. 'అక్కడికి వస్తే చాలు నేనే వచ్చి మిమ్మల్ని కలుసుకుంటాను' అని ఆ ఆకాశరామన్న అన్నాడు.

ముందు 'ఏంటీ న్యూసెన్స్' అనిపించింది శ్యాంబాబుకు. 'సర్వ వృత్తాంతం' అనే న్యూస్ పేపర్‌కు ఆ జిల్లాలో ఏకైక విలేఖరి కావడంవల్ల అతను ఎప్పుడూ తీరిక లేకుండా ఉండేవాడు. ఎన్నో సంఘటనలను గురించి శోధించి తెలుసుకోవలసి ఉంటుంది. పెద్ద పెద్ద దొంగతనాలు, దోపిడీలు, మానభంగాలు, హత్యలు, కొట్లాటలు మామూలుగా జరుగుతూ ఉండే జిల్లా అది. నక్సలైట్లు పెట్రోమాక్స్ లైట్లుమాదిరి 'హైల్టేవోజి' నేరాలను గురించి మిణుగురు పురుగులలో లేవోజిలో ఉన్న చీకటి నేరాల గురించి సరిగా రిపోర్టు చెయ్యకపోతే వాళ్ళకు కోపం వస్తుంది. ఆ లైట్లను ఆర్పివెయ్యడానికి పోలీసువాళ్ళు చేసే వీరశూర పరాక్రమాలను హైలైట్ చెయ్యకపోతే ఖాకీ వాళ్ళకు నచ్చదు. కల్లక్టరు చెప్పేదంతా ఫోటోస్టాట్‌లా పేపర్లో రావాలి. మంత్రిపుంగవులు సందర్శించినపుడు వాళ్ళకు తోకలా తిరగాలి. గాలి వీచినా, వీయకపోయినా రాయాలి. వర్షం మామూలుగా పడినా, లేక పచ్చరంగులో పడ్డా, జల్లులా పడ్డా, వడగళ్ళులా పడ్డా రాయాలి. సంక్షిప్తంగా చెప్పాలంటే

శ్యాంబాబుకు రోజుకు 48 గంటలు ఉంటేనే అతను చెయ్యాల్సిన ధర్మాన్ని సంపూర్ణంగా చెయ్యగలడు. అంత ఒత్తిడిపనుల మధ్యలో ఈ వెధవ 'సర్వర్‌సుందరం' గాడి ఫోను.

ఏమయినా, పాపం ఆయన మూడుసార్లు పిలిచాడు కదా? 'సరే! సాయంత్రం నాలుగంటలకు వచ్చేస్తాను. నువ్వు గేటు దగ్గిరే ఉండాలి' అని కచ్చితంగా చెప్పాడు. శ్యాంబాబుకు ప్రత్యేకమైన ఒక ప్రత్యేకత ఏమిటంటే... తాను చెప్పింది చేస్తాడు. సమయ నిష్టతను చాలా శ్రద్ధతో పాటిస్తాడు. సాయంత్రం వస్తానని చెప్పబోయేముందు అతనిని ఒకసారి పరీక్షించి చూచాడు కూడ.

''నువ్వు రూమ్ నంబర్ 42 అని గదా చెప్పింది? కానీ నీ హోటల్లో మొత్తం పదో పదిహేనో కదా గదులుండేది? మరి ఈ నలభైరెండో గది ఎలా వచ్చింది?

''సార్! ఇక్కడ రూమ్ నంబర్లు మొదలయ్యేదే ముప్ఫయిమూడు నుంచి. ఆఖరు రూమయితే నలభై యెనిమిది. మొదటి నంబరు ఆఖరి నంబరు కలిపితే స్టేట్ ఎక్స్‌ప్రెస్ సిగిరెట్ పెట్టెమీద ఉన్న మూడు అయిదులు మాదిరి ఇక్కడ మూడు మూళ్ళు వస్తాయి. మా యజమానికి న్యూమరాలజీలో చాలా నమ్మకం సార్!''

''హోటల్ వాడికి కూడా న్యూమరాలజీ అవసరమా?''

''సార్! రాష్ట్రం పరిపాలించే వారికి మూడు ఆర్లుగాని, నాలుగు తొమ్మిదులుగాని కావలసినపుడు ఈ బీద హోటల్‌వాడు మూడు మూళ్ళు ఉంచుకోకూడదా?''

''ఏమిరా! నువ్వు హోటల్ సప్లయర్ మాదిరి మాట్లాడడం లేదే!''

'' సార్! మీ ఇంటర్వ్యూ జరిగేటప్పుడు సప్లయర్ అనే ఇంగ్లీషు పదానికి వాళ్ళు స్పెల్లింగ్ అడిగితే 'సప్లై' అనే ఇంగ్లీషు దానికి ఒక 'ఇ, ఆర్' కలిపి చెప్తే ఫెయిల్ అవుతాడు. ఆఖరిమూడు అక్షరాలు 'వై, ఇ, ఆర్' అని తెలుసు కోడానికి కొంచెం చదువు ఉండాలి కదా!''

''సరే! నువ్వు ఏక్లాసు వరకు చదివావు?''

''క్లాసేనా సార్! క్లాసంటే సెకండే కానీ... అది నాకు వచ్చింది ఇంటర్మీడియట్‌లో సార్!''

ఇంక ఎక్కువ మాట్లాడితే అతను షేక్స్‌పియర్, బెర్నార్డ్‌షా విషయాలు ఎత్తుతాడేమోనని భయపడి సాయంత్రం కార్యక్రమం నిర్ణయించుకొని ఫోన్ కింద పెట్టాడు.

సాయంత్రం నాలుగు గంటలకు శ్యాంబాబు హీరోహోండా రాజ్‌కాంటినెంటల్ ముందు ఆగగానే నీలం షర్టు, తెల్లటోపీ, తెల్ల నిక్కరుతో ఒక యువకుడు పరుగెత్తివచ్చి చాలా వినయంతో నమస్కరించాడు.

''కనీసం ఇప్పుడయినా నీ పేరు చెప్తావా?''

''వాటీజ్ ఇన్ ఎ నేమ్ లేదా మై నేమ్ ఈజ్ నోబడీ అని చెప్తే తమరది ఇంగ్లీషు సినిమాలో పేరు అంటారు. బేనామ్, గుమ్‌నామ్, బద్‌నామ్, మేరానామ్ జోకర్ అని చెప్తే అదంతా హిందీ సినిమాలో పేరని తమరంటారు. సర్దార్ పాపారాయుడు, సీతారామయ్య, వెంకటసామి లేక వట్టి రాముడు అని అంటే అవి తెలుగు సినిమానుంచి దొంగిలించిన పేరంటారు.''

''ఒరేయ్ వదరుబోతూ! నీ పదోక్లాసు సర్టిఫికెట్‌లో నీపేరు ఎలా ఉందో చెప్పు.''

''ఆ పేరే సార్ నాకు మా తల్లి తండ్రులు పెట్టింది? నేను చదివి పెద్దవాణ్ణై ఇండియా ప్రెసిడెంట్ కాకపోయినా కనీసం తెలుగు సినిమాలో ఒక హీరో అవుతానని వాళ్ళు కలలు కని ఉంటారు.''

''ఏమయ్యా! నీవు క్విజ్ ప్రోగ్రాం నడిపిస్తున్నావా? నీపేరు రాజేంద్రప్రసాద్ కదా!''

''అయితే తమరు తెలివైనవాళ్ళే''

''పోరా గాడిదా! దానికి నీ సర్టిఫికెట్ నాకు కావాలా...''

''వద్దుసార్... వద్దు... ఇంకేం చెప్పకండి నేనొక్క క్షణంలో వేడి టీ తెస్తా... అసలు విషయం వచ్చాకే చెప్తా'' అంటూ వెళ్ళిపోయాడు.

చుట్టూతా హోటల్ బిల్డింగ్, మధ్యలో ఖాళీ స్థలం. కొన్నికార్లు, ద్విచక్ర వాహనాలు అక్కడ పెట్టుకోడానికి చోటు ఉంది. దానికి మధ్యన ఒక పెద్ద మామిడి చెట్టు పెద్ద గొడుగు తెరిచి పట్టినట్లుగా ఉంది. ఆ చెట్టు మొదలుకు చుట్టూ సిమెంట్ అరుగు ఉంది. అక్కడ కూర్చుంటే హోటల్‌లో జరిగేదంతా దాదాపు కనిపిస్తుంది.

రాజేంద్రప్రసాద్ ఒక వేడి టీ కప్పుతో వచ్చాడు. శ్యాంబాబు దాన్ని సిప్ చేస్తుండగా అతను నలభైరెండో నంబరు గదివైపు చూపించి విషయం వివరించాడు.

''సార్! ఆ రూమ్‌లో మా ఇన్స్పెక్టర్ దొరబాబు ఎవరో ఒక మనిషిని ఉంచాడు. ఈరోజు మూడో రోజు. అందుకే తమర్ని పిలిచాను. ఆ గదిముందు నిల్చున్న ఇద్దరు ఘటోత్కచులు

మఫ్టీ పోలీసులే. ఇప్పుడు లోపల ఇన్స్పెక్టర్ దొరబాబు, అతని సబ్ ఇన్స్పెక్టర్ కూడ ఉన్నారు. అప్పుడప్పుడు బిరియాని లోపలికి పోతుంటుంది. అప్పుడప్పుడు అన్నం, పెరుగు పోతుంటాయి. ఒకసారి ఒక డజన్ అరటిపళ్ళు, ఇంకోసారి విస్కీగాని, బ్రాందీగాని, బీర్‌గాని పోతూనే ఉంటాయి. అప్పుడప్పుడూ బకెట్‌తో వేణ్ణీళ్లు కూడా తీసుకొని వెళ్తుంటారు. దానిలోపల ఏమేం జరుగుతుందో ఎవరికీ తెలియదు. అక్కడికి ఎప్పుడూ వెళ్ళేది ఒకే ఒక బేరర్ మాత్రమే. ఆ దొంగ వెధవని అడిగినా ఏం చెప్పడం లేదు. అందుకే... తమరు ప్రయత్నం చేస్తే ఈ గుట్టు రట్టవుతుంది. తమకు కూడా ఇది ఆసక్తికరంగా ఉండవచ్చు.''

శ్యాంబాబు కొంచెం సేపు రూమ్‌వైపు చూస్తూ కూర్చున్నాడు. ఎవరెవరో లోపలికి వెళ్తూనే ఉన్నారు. అక్కడ ఏమేమో జరుగుతూనే ఉంది. అప్పుడు ఇన్స్పెక్టర్ దొరబాబు రూమ్ నుంచి బైటికి వచ్చి మెట్లుదిగడం శ్యాంబాబు గమనించాడు. ఆ ఇన్స్పెక్టర్ దృష్టిలో పడకుండా అతను మెల్లగా మెట్లెక్కి రూమ్ దగ్గరకు వెళ్ళాడు. అక్కడ నిలబడిన కాన్స్టేబుల్స్‌కు శ్యాంబాబు బాగా తెలుసు. నిజం చెప్పాలంటే అతనికి నిజామాబాద్‌లో ఉన్న పోలీసుల్లో ఎవరూ తెలియనివారు ఉండరు. వాళ్ళిద్దరు అతనికి సలాం కొట్టారు కానీ లోపలికి వెళ్ళనియ్యలేదు.

''అరే మీ ఇన్స్పెక్టర్ దొరబాబు చెప్పడం బట్టే నేనొచ్చాను. ఇప్పుడే ఆయన కిందికి వెళ్తూ నన్ను ఈ రూమ్‌లో వెయిట్ చెయ్యమని చెప్పాడు.''

ఇలా చెప్తూనే శ్యాంబాబు తలుపు తట్టడం, లోపల్నించి చిన్నగా తలుపు తెరుచుకోవడం అతను లోపలికి దూసుకొనిపోవడం ఒకే క్షణంలో జరిగిపోయాయి.

లోపల మఫ్టీలో ఉన్న సబ్ ఇన్స్పెక్టర్ మస్తాన్ జడిసిపోయ్యాడు కానీ అతనొక సలాంకొట్టి 'సార్! సార్!' అంటూ ఏదో చెప్పబోయాడు.

''డోన్ట్ వర్రీ మస్తాన్... భయపడాల్సిందేం లేదు. దొరబాబు రెండు నిమిషాల్లో వస్తానన్నాడు'' అంటూ శ్యాంబాబు ఒక కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

గోడకు ఆనుకుని ఉన్న ఒక మంచంలో రంగు లుంగీ మాత్రమే కట్టుకుని ఉన్న ఒక స్థూలకాయుడు పడుకుని ఉన్నాడు. శ్యాంబాబుని చూడగానే పరిచయం లేకున్నా రెండు చేతులూ పైకెత్తి నమస్కరించాడు. కానీ ఆయన శరీరాన్ని ఒక్క అంగుళం కూడ పైకి లేపలేదు.

''మీ పేరేంటి?'' అని శ్యాంబాబు ఆ అనంతశయనుణ్ణి అడిగాడు.

''నాపేరు భాస్కరుడండీ... కానీ వీళ్ళంతా నన్ను తస్కరుడంటారండీ... అందువల్ల నాకేం అభ్యంతరం లేదు. ఆఫ్టరాల్ నా ప్రొఫెషన్ అదే కదా! అని బాగా క్షీణించి ఉన్న ఆ భారీ కాయుడన్నాడు. అతను గడ్డం గీసుకుని కనీసం ఒక పది రోజులయ్యుంటుంది. అతనిది బాగా ఆరోగ్యవంతమయిన శరీరమయినా అతని ముఖంలో అలసట కనిపించింది. నల్లనిరంగు అంటే మరీ నూనెపూసినట్లు నిగనిగలాడే నల్లరంగు కాదు. కొత్తగా తారు వేసిన రోడ్డు మాదిరి కాదు. అదే రోడ్డు కొంతకాలం తరవాత వచ్చిన వేసవిలో కొంత తెల్లబడుతున్న రంగు అతనిది. వర్షంలో స్నానం చేసిన ఆ రోడ్డుకు పాత నల్లరంగు మళ్ళీ వస్తుంది. కానీ అతను ఎంత స్నానం చేసినా పూర్తి శ్యామవర్ణుడు కాడు. ఎత్తు దాదాపు అయిదడుగుల పది అంగుళాలు ఉంటుంది. కానీ మామూలు వాళ్ళకు అతను ఆరడుగుల మనిషి అని అనిపిస్తాడు. ముఖం నిండా స్ఫోటకం మచ్చలున్నట్లుంటాయి. కానీ అవి చికెన్ పాక్స్ మచ్చలా లేక అతని యవ్వనకాలంలో ముఖం నిండా చిగురించిన మొటిమలవల్ల ఏర్పడిన మచ్చలా అని చెప్పడం కష్టం. ( మీరేం అనుకున్నా అతనికి అభ్యంతరం లేకపోవచ్చు. ) పదిరోజులుగా గడ్డం చేసుకోనందువల్ల అతని అసలు మీసాల స్టైల్ ఏమిటని తెలుసుకోవడం కష్టం. కానీ కొంచెం దగ్గరగా వెళ్ళి చూస్తే అక్కినేని స్టైల్‌లో సన్నని మీసం ఉండేదని అర్థం అవుతుంది. కుడికంటికి పైన ఒక గంటు ఉంది. అతని రెండు చెవులకు దుద్దులకోసమో లేక తాడువేసి తలకాయను వెనక్కిలాగి కట్టడానికో లేక పువ్వులు పడిపోకుండా గట్టిగా పెట్టడానికో రెండు రంధ్రాలున్నాయి. కానీ ఆ రంధ్రాలు పూడిపోకుండా ఉండడానికి మామూలుగా పెట్టే పుల్లారావులు కూడలేవు. అతని పెదవిని దంతాలను చూస్తే అతనొక చెయిన్‌స్మోకర్ అని తెలుస్తుంది. కనుబొమలు రెండూ కలిసి ఉండడం వల్ల అతని ముఖానికి అడ్డంగా నల్లని పట్టీ అంటించినట్లు ఉంది. అంటే అది ఒక టూ-ఇన్-వన్ కనుబొమ అని చెప్పవచ్చు. విశాల నయనాలు కానీ ఇప్పుడు కొంచెం ఎర్రగా ఉన్నాయి. శరీరం నిండా రోమాలు కొంచెం సమృద్ధంగానే ఉన్నాయి. హెయిర్ కట్‌కు అతను ఒక బార్బర్ దగ్గరకు ఆ కార్యక్రమానంతరం... 'వాటెబౌట్ ఎ హోల్ బాడీ షేవ్ సర్?' అని ఏ క్షురకుడయినా అడగడానికి ప్రేరణ కలుగుతుంది. ఎంత తక్కువ అంచనా వేసినా అతని శరీరం 90 కిలోల బరువు ఉంటుంది. కానీ ఇప్పుడు అందులో పాతిక భాగం బరువు అతని ఉదరపరిసరాల్లో కేంద్రీకృతమైనట్లు అనిపిస్తుంది. మొత్తంగా చూస్తే ఫరవాలేదనే అనిపిస్తాడు. వయస్సు దాదాపు ముప్పయ్యయిదే ఉంటుంది.

''సార్! నేను పదోక్లాసు పాసయ్యాను సార్''

''మీ వయస్సెంత?''

''సర్టిఫికెట్లో ఉన్న వయస్సు ముప్ఫయిమూడు. అసలు వయస్సు ముప్ఫయి నాలుగు.''

''మీకు ఎత్తు బాగనే ఉంది కదా? మీరు పోలీసు సర్వీసులో ఎందుకు చేరలేదు?''

''సార్! చిన్నపుడు 'దొంగా పోలీసు' ఆట అడే రోజుల్లో కూడ నాకు దొంగ కావడానికే ఛాన్సు దొరికేది. నాకన్న చురుకైన పిల్లలు పోలీసువాళ్ళుగా ఆడేవాళ్ళు. వాళ్ళకు దెబ్బతినడం తప్పడమేకాక నన్ను కొట్టడంవల్ల వాళ్ళకు ఆనందం కలిగేది. నేను వాళ్ళంత సమర్థుణ్ణి కాకపోవడంవల్ల వాళ్ళతో దెబ్బలు తినేవాణ్ణి. నా ప్రస్తుత పరిస్థితి చూడండి సార్... ఈరోజు గతికూడా అంతే...''

''పదో క్లాసు పాసయ్యాక ఉద్యోగం కోసం ఏమీ ప్రయత్నం చేయలేదా?''

''పదిహేనేళ్ళకి నేను పదో క్లాసు పాసయ్యాను. ఇంట్లో పరిస్థితులు బాగలేకపోవడం వల్ల కాలేజీ చదువుకు నాకు ఛాన్సు దొరకలేదు. ఎవ్వరూ ఆధారం లేని నా రోగిష్టి తల్లిని చూచుకోవాల్సిన బాధ్యత కూడ నామీద పడింది.''

''నీకు తండ్రిగాని, తోడబుట్టిన వాళ్ళుగాని లేరా?''

''నాకు తండ్రి అనే వ్యక్తి ఎప్పుడో ఒకప్పుడు ఉండేవాడు. నా అక్కకి పన్నెండు, నాకు పది సంవత్సరాలున్నప్పుడు ఆయనకి ఒక పద్దెనిమిదేళ్ళ అమ్మాయితో ప్రేమబంధం ఏర్పడింది. ఆ విషయంలో మా తల్లిదండ్రుల మధ్య జరిగిన గొడవలో మా తల్లికి ఒక చెవి పోయింది. మరో చెవికి తెలియకుండ ఆయన ఆ అమ్మాయితో లేచిపోయాడు. తరవాత నన్ను, నా అక్కనీ నా తల్లే పెంచింది. అక్క ఐదో తరగతివరకే చదివింది. నేను బాగా చదివి ఒక పెద్ద ఆఫీసరు కావాలని ఆమెకు ఆశ ఉండేది. పొరుగిళ్ళల్లో పనిచేసి మాకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండ చూచుకొనేది. పదోక్లాసు పరీక్ష పూర్తయ్యేరోజు. అన్ని పేపర్లు నేను బాగానే రాశాను... పాసవడం ఖాయమన్న విషయాన్ని సంతోషంతో అమ్మకు చెబుదామని వచ్చేటప్పటికి ఆమె పిచ్చి పట్టిన దానిలా ఏడుస్తోంది... కేవలం పదిహేడు సంవత్సరాల వయస్సున్న నా అక్క ఎవరితోనో వెళ్ళి పోయిందని...

''కొన్ని రోజులు అక్కను వెదుకుతూ అటూ ఇటూ తిరిగాను. కానీ ఆమె జాడలేదు. ఒకరోజు అక్కనుంచి ఒక ఉత్తరం వచ్చింది. ప్రస్తుతం బొంబాయిలో ఉన్నాననీ, చాలా సుఖంగా ఉన్నాననీ, తన గురించి అమ్మ ఆందోళన పడవలసిన అవసరం లేదనీ, వీలు పడినపుడు వచ్చి అమ్మనీ, తమ్ముణ్ణీ చూస్తాననీ అందులో రాసింది.

''అదంతా నా అక్కకు సంబంధించిన సమాచారం. రిజల్టు వచ్చాక నాకు ఫస్ట్ క్లాస్ వచ్చిందని తెలిసింది. ఆరోజు నా తల్లి సంతోషంతో పొంగిపోయింది. ఎంత కష్టపడైనా

నన్ను కాలేజికి పంపుతానని గట్టిగా చెప్పింది. నేను కొన్ని కాలేజీల నుంచి అప్లికేషన్ ఫారాలు తెచ్చి పూర్తి చేశాను కూడ. అప్పుడు అమ్మకు హఠాత్తుగా తీవ్రమైన జ్వరం వచ్చింది. కొన్ని రోజుల వరకు తగ్గలేదు. ఆమెను ఆసుపత్రికి తీసుకొనిపోయి డాక్టర్లకు చూపించాను. చాల మందులు, ఇంజక్షన్లు కూడ ఇచ్చారు. కానీ ఒకరోజు ఉదయం చూచేటప్పటికి ఆమెకు రెండు కాళ్ళు చచ్చుబడి ఉన్నాయి. ఆమెను తిరిగి మామూలు మనిషిని చేయడానికి నేను చెయ్యని పనిలేదు. ఎంత సంపాదించినా మందులకే సరిపోయింది కానీ ఖరీదైన ఇంజక్షన్లకు చాలలేదు. అంతలోనే అమ్మ కాళ్ళు మెల్లగా ఈడ్చుకుంటూ ఇంట్లో కొంచెం తిరగడం మొదలు పెట్టింది. కొన్ని రోజుల తరవాత ఒక కాలికి మాత్రం ప్రాణం వచ్చింది. దాంతో ఆమె ఇంట్లో పనులు చేసుకోవడం మొదలు పెట్టింది. కానీ నన్ను కాలేజీకి పంపలేకపోయిందని ఆమె దిగులుగానే ఉండేది. నేనెంత కష్టపడి రాత్రి, పగలు పనిచేసినా ఖర్చులకు డబ్బు సరిపడేది కాదు. ఆ సమయంలో నాకు ఒక స్నేహితుడు జేబు కొట్టడం నేర్పించాడు. కానీ దానివల్ల డబ్బువచ్చినా, దెబ్బలు తినడం, పోలీసువాళ్ళ చేతుల్లో పడడం అనే ప్రమాదాలు ఎక్కువగా ఉండడంవల్ల ఆ వృత్తినే నేను స్థిరంగా అవలంబించ లేకపోయాను. తరవాత రైల్వే స్టేషన్లలో యూనిఫాం లేని పోర్టర్గా పనిచేసేటప్పుడు అవకాశం వచ్చినప్పుడల్లా ట్రెయిన్లో కిటికీ దగ్గర అజాగ్రత్తగా కూర్చున్న ఆడవాళ్ళ గొలుసులు లాగడం చాలా సులువైన పని అని నాకనిపించింది.

''పాపం! ఆ ఆడవాళ్ళకు ఎంత బాధ కలుగుతుందో ఆలోచించావా!'' అని శ్యాంబాబు అడిగాడు.

''లేదు సార్! నాకా విషయంలో ఎలాంటి కష్టం అనిపించలేదు... ఈ రోజు వరకు... అలాంటి ఆడవాళ్ళు గొలుసులు నన్ను లాక్కోమని ఆహ్వానిస్తున్నట్లు, నన్ను ఆకర్షిస్తున్నట్లు అనిపిస్తుంది. కొందరు ఆడవాళ్ళు పెళ్ళికూతురు లాగే ముస్తాబై రైల్లో ప్రయాణం చెయ్యడం చూస్తే వాళ్ళ మెడనే కత్తిరించేసి తీసుకొని పోవాలా అని నా చేతులు గుంజుతాయి. ఈ లాక్కోవడం కేసులలో ఆ నేరాలు జరగడానికి కారణభూతులు ఆడవాళ్ళు. పాపం ఈ యువకులు నేరాలు చేయడానికి నిజానికి వాళ్ళే ప్రేరణ.''

''ఒరే! తస్కరా! నీవిప్పుడు మాట్లాడేది 'విక్టిమాలజీ' గురించని తెలుసు !''

''ఆ సిద్ధాంతం కరక్టేకదా సార్! ఒకరైలు ప్లాట్ఫాం మీద ఉన్నప్పుడు, అందర్నీ చూస్తూ నడుస్తున్నపుడు కిటికీ పక్కన బంగారు గొలుసుల్ని ప్రదర్శిస్తూ కూర్చున్న ఆడవాళ్ళను చూస్తే నాకు జుగుప్స... కోపం... తిరస్కారం... దమ్ముంటే వచ్చి తీసుకొనిపోరా అని వాళ్ళు ఛాలెంజి చేస్తున్నట్లు అనిపిస్తుంది.

ఒకవేళ బంగారు గొలుసులు వేసుకోవడం తప్పనిసరయిందని అనుకున్నా కిటికీ దగ్గరే కూర్చోవాలా? కొంచెం లోపలికి కూర్చోవచ్చుగా? ప్రయాణం చేసేటప్పుడు అంత బంగారం ఎందుకు పెట్టుకుంటున్నారు?

''ఒరే, దొంగా! మెడలో పెట్టుకుంటే గొలుసు మాత్రమే లాగేస్తావు. కానీ పెట్టెలో పెడితే పెట్టె మొత్తం గోవిందా! పెట్టె కంటె శరీరమే సేఫ్ అని మామూలుగా ఆడవాళ్ళు అనుకుంటారు. అది కర్టే కదా!''

''అది కర్టే సార్! కానీ ఆ బంగారు వస్తువు వేరేవాళ్ళ కంటికి మిరుమిట్లు గొలుపుతుంది కదా! అటువంటప్పుడు తమ సొంత భద్రతకోసం కనీస జాగ్రత్త తీసుకోవలసిన శ్రద్ధ వాళ్ళకుండాలి కదా!''

''భాస్కరా! నీవు మామూలు దొంగవి కాదయ్యా! చదువుకున్న దొంగవి... నువ్వు చెప్పే మాటల్లో కొంచెం నిజం ఉంది. నీకు కూడ ఈ విషయం ఇంత బాగా తెలిసినపుడు మిగిలిన వాళ్ళకు కనీసం చదువుకున్న వాళ్ళకు అదెందుకు తెలియదు? వాళ్ళను చదువుకున్న గాడిదలని చెప్పాలి.''

''సార్! ఇది ఒకరకం ప్రకోపం... కానీ నేనింకా యువకుడిగా ఉన్నపుడయితే అంటే దాదాపు 25 సం.ల వరకు ఛాతీలో సగభాగం, వీపు మొత్తం కనిపించేలా నడిచే ఆడవాళ్ళను చూడగానే నా చేతులు గింజుకోడం మాత్రమే కాదు... నా రక్తం కూడ సలసల కాగుతుంది. వాళ్ళు వస్త్రాలు ధరించడం ఎందుకు? శరీరం కప్పుకోడానికా? లేక లోపల ఉన్న భాగాల్ని ఇంకా ఆకర్షణీయంగా బైటికి చూపించుకోడానికా? అలా కొద్దిగా మాత్రమే కప్పుకుని ఎక్కువ భాగం కనిపించేలా దుస్తులు ధరిస్తే లోపల ఉన్న భాగాలు కూడాచూడాలన్న కుతూహలం పెరగడం ఒక సహజమైన రియాక్షనే కదా! లోపల ఉన్న భాగాలు మమ్మల్ని పిలుస్తున్నాయి అని వేడి రక్తం ఉన్న యువకులకు అనిపిస్తే దానిలో తప్పు లేదు. బాగా డబ్బున్న వాళ్ళే రైళ్ళల్లో ఇలా అర్ధనగ్నంగా ప్రయాణం చేస్తారు. వాళ్ళను ముట్టుకోడానికే నాకు అర్హత లేదని తెలుసు. అయితే అవన్నీ నాకెందుకు చూపించుకోవడం? ఫ్లాట్‌ఫాం నుంచి రైలు ముందుకు కదుల్తున్నపుడు నేను దాంతో పరుగెత్తి అలాంటి ఆడవాళ్ళ శరీరాన్ని స్పర్శించి నేను ఆనందానుభూతి పొందాను. నేను చెయ్యి పెట్టేది గొలుసు గుంజడానికి కాకపోయినా వాళ్ళు గొలుసు పోయింది... పోయింది అని అరుస్తారు... అది ఇతరులకు అసలు విషయం తెలియకుండా ఉండాలనే...''

''అపరిచిత ప్రేమికుడా! నీ దాడి బాగానే ఉందే!''

''ప్రేమికుడినా సార్! నేను ఏ ఆడదాన్నీ ప్రేమించలేదు... ప్రేమించను... ఆడవాళ్ళంటేనే నాకు అసహ్యం... వాళ్ళమీద ఉమ్మేయాలని అనిపిస్తుంది... నా తల్లిని తండ్రి నుంచి దూరం చేసింది ఒక ఆడదే సార్. నా తల్లి రోగానికి కారణం కూడ ఇంకో ఆడదే సార్... నా సొంత అక్క... ఇలాంటి స్త్రీలోకాన్ని నేను పూలుపోసి పూజించాలా? లేక పోతే... పో... అని తిరస్కరించాలా?''

''అయితే నీకు నీ తల్లిమీద కూడ మంచి అభిప్రాయం లేదా? ఆమె ఆరోగ్యం ఎలా ఉందిప్పుడు?''

''ఆమె బాగ సుఖంగా ఉంది సార్ ఇప్పుడు... ఈ లోకంలోని అన్ని కష్టాల్నుంచి సెలవు తీసుకుంది. అమ్మ చనిపోయినపుడు నేను జైల్లో ఉన్నాను. నాకు కనీసం ఆ వార్త కూడ అందలేదు. చుట్టుపక్కల ఉన్నవాళ్ళు దయతో ఆమెను దహనం చేశారు. తల్లికి కొరివి పెట్టడానికి కూడ ఈ కొడుక్కు అదృష్టం లేదు సార్. ఒక చచ్చిపోయిన కుక్కను ఈడ్చి పారేసినట్లు జనమే... -'' పొంగుతున్న దుఃఖంలో గొంతు వణినిగిపోయింది. ఆగిపోయింది.

''అయాం సారీ భాస్కరా! అయాం సారీ!'' అని శ్యాంబాబు అంటుంటే అతని కళ్ళకు మబ్బుతెర కట్టినట్టయింది.

''ఫరవాలేదు సార్ ఫరవాలేదు. ఈ లోకంలో పుట్టిన వాళ్ళంతా గిట్టాల్సిందే. చావడానికే మనం పుట్టేది. జీవితంలో ఏం సాధించకపోయినా మన అంతిమ లక్ష్యానికి మనల్ని దూరం చేయడానికి ఏ శక్తికీ సాధ్యం కాదు. ప్రతి మనిషీ ఎలా చావాలి? ఎక్కడ చావాలి? ఎప్పుడు చావాలి అనే విషయం గురించే కదా 'కబ్, క్యోం ఔర్ కహా' అని చెప్తారు. బాగా డబ్బున్న వాళ్లైనా కొంతమంది రోడ్డులో పడి చచ్చిపోయి వాళ్ళ బంధువులకు తెలియకుండా మునిసిపాలిటీ వాళ్ళ చేతుల్తోనే మట్టిలో కలిసిపోతారు. అదంతా దైవవిధి ప్రకారమే జరుగుతుంది. నాకు పదిహేడు సంవత్సరాలపుడే అమ్మ పోయింది. అప్పట్నుండి నేను గూడులేని పక్షిలాగే తిరుగుతున్నాను. నాకు ఈ చోటనీ ఆ చోటనీ ఏం లేదు. ఎక్కడ కావాలంటే అక్కడ తినొచ్చు. ఎక్కడ కావాలంటే అక్కడ పడుకోవచ్చు. నన్ను అడిగేవాళ్ళు, నేను చెప్పేవాళ్ళు ఎవరూ లేరు. ఎవరూ ఉండరు. నేను చచ్చినా ఏడవడానికి ఎవరూ ఉండరు సార్. చచ్చిపోతే ఎవరైనా ఏడవడం అవసరమా సార్.''

అతనొక వేదాంతిలాగే మాట్లాడుతున్నాడు గానీ అతని గుండెలోపల విషాదం జ్వలిస్తుంటుందని తెలుసుకొని శ్యాంబాబు అతని మంచం దగ్గరికి వెళ్ళి అతన్ని

ఓదార్చడానికి ఒక చెయ్యి పట్టుకున్నాడు. అప్పుడు భాస్కరుడు తన రెండో చేతిని కూడ అతని చెయ్యిమీద ఉంచాడు.

ఇంతసేపు ఏం చెప్పకుండా చూస్తూ నిలబడ్డ మస్తాన్

''సార్! ఇతను తాగి ఫిట్టయి ఉన్నాడు సార్! అందుకే ఇలా పిచ్చి పిచ్చిగా వాగుతున్నాడు. అతనేం చెప్తున్నాడో అతనికే తెలియదు'' అంటూ జోక్యం చేసుకున్నాడు.

''పాపం! అతనేం చెప్పాలనుకుంటే అది చెప్పనియ్ మస్తాన్!'' అని యస్ఐతో అంటూ ''కానీ ఇప్పుడు ఇక్కడ మీరేం చేస్తున్నారు?'' అని భాస్కర్‌ను అడిగాడు.

''సార్! నేనిప్పుడు ఒక రెగ్యులర్ పోర్టర్‌గా చేస్తున్నాను. వాళ్ళ యూనియన్‌కు నేను లీడర్ని కూడ... అవకాశం దొరికినప్పుడు అప్పుడప్పుడు కొంచెం దొంగతనం చేస్తూ ఉంటాను. పోలీసులు పట్టుకుంటే నేను అన్నీ చెప్పేస్తాను. తప్పు చేస్తాను కానీ తప్పు మాట్లాడను. ఈ విషయంలో మాత్రం నేను పక్కా 'గాంధియన్' సార్.''

''అదెలా?''

''సార్! గాంధీగారి మూడు కోతులున్నాయి కదా? అవేం చేస్తాయి? తప్పు వినకూడదు, తప్పు చూడకూడదు, తప్పు అనకూడదు అనే కదా అవి చూపించేది? అది నేను పాటిస్తాను. అందుకే తప్పు చెప్పడంగాని, తప్పు చూడడంగాని, తప్పు వినడంగాని చేయను సార్. 'తప్పు' అని వేరేవాళ్ళు అనుకునే పనులు కొన్ని నేను చేస్తాను. కానీ అవి తప్పని నేను మాత్రం ఒప్పుకోను. నేను దొంగ అయితే వీళ్ళంతా దొంగలకి మించిన దొంగలు... గజదొంగలు. నేను పోలీసు వాణ్ణి కానందుకు నాకు సంతోషంగానే ఉంది.''

''నోర్మూయ్యరా దొంగ!'' అని మస్తాన్ ఆక్రోశించాడు.

''నోరు ముయ్యడానికి నేను సిద్ధంగానే ఉన్నాను. కానీ మీరే కదా కొన్ని రోజుల్నుంచి నానోరు బలవంతంగా తెరిపించి అన్నీ లోపలికి తోస్తున్నారు?'' అని అడిగేటప్పటికి మస్తాన్ ముఖం ఒక జీరోవాట్ బల్బులాగా మారింది.

''సార్! నేను దొంగతనం చేసే వాణ్ణనే స్వయంగా చెప్పాను కదా! ఈ పోలీసువాళ్ళు నన్ను క్వొశ్చన్ చేసేటప్పుడు నాకు తెలిసినవన్నీ నేను చెప్పేస్తాను. అందుకే దొంగ వస్తువుల్ని రికవర్ చెయ్యడం వాళ్ళకు చాలా సులువు. చాలాసార్లు నా సహాయంతో పోయిన వస్తువులు దొరకడంవల్ల నన్ను కోర్టుకు పంపకుండా నిజం చెప్పని దొంగల్ని జైలుకు పంపారు. వాళ్ళు చెప్పిన ప్రకారంగానే బంగారు గొలుసుల్ని లాగేసి వాళ్ళకియ్యడానికి నేను సిద్ధంగానే ఉన్నాను.

అంటే మరీ బొత్తిగా రోజూ అనుకుంటారేమో... కాదు... అప్పుడప్పుడు మాత్రమే. పాపం... పోలీసు వాళ్ళు కూడా బ్రతకాలి గద ! కానీ నేను చెయ్యని నేరం నేను చేశానని చెప్పాలంటే ఈ దొంగ బాబు... అయాంసారీ... ఈ దొరబాబే కాదు అతని ముత్తాత వచ్చినా కాదు.''

ఈ సమయంలో చెమటకారుతూ, పాలిపోయిన ముఖంతో దొరబాబు అనే ఇన్స్పెక్టర్ రంగ ప్రవేశం చేశాడు. శ్యాంబాబు వచ్చింది తెలియనట్లు నటిస్తూ అతను ''ఆహా! ఇతనెవరు శ్యాంబాబా! ఇక్కడేం చేస్తున్నారు?'' అని అడిగాడు.

''ఈ భాస్కరుడు ఇక్కడ ఉన్నాడని తెలిసి వచ్చాను. ఇతను నాకు దూరపు బంధువు...'' అని శ్యాంబాబు అన్నాడు.

''ఊ! రాండి... రెస్టారెంట్కి పోయి టీ తాగుతూ మాట్లాడుకుందాం'' అంటూ శ్యాంబాబు చెయ్యి పట్టుకుని లాక్కెళ్ళాడు. బైటికి వెళ్ళేలోపల

''భాస్కరా! నేను మళ్ళీ వచ్చాక మిగిలిన విషయాలు మాట్లాడుకుందాం'' అని మరో చెయ్యిని ఊపుతూ శ్యాంబాబు చెప్పాడు.

భాస్కరుడు కొద్దిగా మంచంమీది నుంచి లేస్తున్నట్లుగా లేచి రెండు చేతులూ జోడించాడు.

కింద రెస్టారెంట్కు వెళ్ళి, ఒక మూల ఉన్న టేబుల్ దగ్గర కూర్చుని 'టీ'కి ముందు, 'టీ' మెల్లగా తాగేటప్పుడు, తరవాత పది నిమిషాల దాకా దొంగబాబు... అయాంసారీ దొరబాబు అనే ఇన్స్పెక్టర్ తన బాధల గాథను వివరించాడు.

శూరభద్రరావు అనే మాజీ మంత్రి ఇంటినుంచి ఒక అయిదు తులాల గొలుసు దొంగతనం జరిగి ఇప్పటికి దాదాపు రెండు నెలలయిందట. రాష్ట్ర ప్రభుత్వంలో ఇప్పటికీ గట్టి పలుకుబడి ఉన్న ఈ రాజకీయ రాక్షసుడు తన ప్రాణం తింటున్నాడని ఇన్స్పెక్టర్ తనగోడు వినిపించాడు. అతను అప్పుడప్పుడూ ఫోన్ ద్వారా, మరొకప్పుడు ఇంటికి పిలిపించి, ఆ ఇన్స్పెక్టర్నే ఆ దొంగతనం గురించి ఇంటరాగేట్ చేస్తున్నాడట. అతని ధోరణి చూస్తే ఆ ఏరియా సర్కిల్ ఇన్స్పెక్టర్ ఈ దొంగతనం చేసినట్లుంది. ఆ దొంగతనం జరిగిందా అన్న విషయం కూడ సంశయాస్పదమే. గత్యంతరం లేక భాస్కరుణ్ణే పట్టుకుని ఒక అయిదు తులాల బంగారం కూడ సంపాదించాడట. అది పట్టుకునిపోయి ఆ పాత మంత్రికి చూపించి ఆయనకు ఏ డిజైన్లో కావాలంటే ఆ డిజైన్లో గొలుసు చేసి యిస్తానని చెప్తే...

''అలా దానమేమీ నాకొద్దయ్యా... గొలుసు తయారు చేసుకో... కానీ కేసు చార్జి చేసి దొంగను జైలుకు పంపించి కోర్టుద్వారానే గొలుసు ఇప్పించు. దొంగ దొరికాడు గదా! అతన్ని నాకొకసారి చూపించు... అతన్నిక్కడికి తీసుకొస్తావా? లేక నేనే స్టేషన్‌కి రావాలా?'' అని ఆ మంత్రి పుంగవుడు కొత్త చిక్కుల్లో పడేశాడు.

''మరింకేం చేయను?'' భాస్కరుణ్ణి స్టేషన్‌కు తీసుకొచ్చి విషయం చెప్పాము. కానీ అది తాను రైల్లో లాక్కున్న గొలుసని చెప్తానంటాడే గాని ఇంకో రకంగా దొంగిలించానని చెప్పడానికి తాను సిద్ధంగా లేనని భాస్కరుడు అన్నాడు. సామ, దాన, భేద, దండో పాయాలన్నీ ప్రయోగించాము. కానీ భస్కరుడు అబద్ధం చెప్పడానికి అంగీకరించలేదు... హరిశ్చంద్రుడి బావమరిది లాగ... ఆఖరికి అతన్ని బాగా హాండిల్‌చేశాం. నేను నా సిబ్బంది కూడా బాగా అలిసిపోయి ఉన్నప్పుడు బల్లమీద ఉంచిన రివాల్వర్‌లో ఉన్న ఆరు తూటాలను ఎవరూ చూడకుండా అతను మింగేశాడు. ఎలా మింగేశాడో? తరవాత అతను నవ్వుతూ చెప్పాడు. ''నేను అబద్ధం చెప్పనని కదా చెప్పాను... అయితే మీకు చాలా అవసరమయిన ఒక నిజం నేనిప్పుడు చెప్తాను. ఈ రివాల్వర్ కడుపులో ఉండాల్సిన ఆరు తూటాలు నా కడుపులోకి వెళ్ళిపోయాయి. ఇంక మీరు నన్నేం చేయగలరో చూస్తాను! ఇదొక పెద్ద సమస్య అయింది. అతని బాడీని, చుట్టూ ఉన్న పరిసరాల్ని అంతా వెదికాం. తూటాలు మాయం. ఇంక నా ఉద్యోగం పోయినట్లే. అతన్ని హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ డాక్టరు దగ్గర యక్స్-రే తీయించాం. తూటాలు పొట్టలో, చిన్న పేగుల్లో అక్కడక్కడా తగులుకుని ఉన్నాయి. ఆపరేషన్‌చేయాలంటే అదొక మేజర్ ఆపరేషన్ అవుతుంది. దానికి పేషెంట్ ఒప్పుకోవాలి కద... ఒప్పుకోడు... అవి మామూలుగా వాటంతటవే బైటికి వచ్చేస్తాయి. అందుకే వాడికి కొంచెం ఎక్కువ తిండి పెట్టి, అరటిపళ్ళు ఎక్కువగా తినిపించి, విరేచనాల మందుకూడ ఇస్తే రెండు రోజుల్లో బైటికి వచ్చేస్తాయని డాక్టర్ చెప్పాడు.

''ఈ హోటల్‌కు తీసుకొని వచ్చి అతను కావాలన్నదీ, వద్దన్నదీ అన్నీ తినిపించి, తాగిపించి విరేచనం మందుకూడ ఇచ్చాం. ఎనిమా కూడ ఇచ్చాం కానీ... గత నాలుగు రోజుల్లో మూడు తూటాలు మాత్రమే బైటికి వచ్చాయి. మళ్ళీ యక్స్-రే తీసి చూస్తే నాలుగు బైటికి పోయినట్లు, రెండే మిగిలి ఉన్నట్లు కనిపించింది. దానిలో ఒకటి ఎక్కడికి పోయిందీ అని అర్థం కావడం లేదు. మా పోలీసువాళ్ళే కదా! ఈ చిన్న పనికూడ సక్రమంగా చేయడం చేతకాదు. మిగిలిన రెండు తూటాలు చిన్న పేగుల్లోనే అంటుకుని ఉన్నాయి. అవి మెల్లమెల్లగ కిందికి వచ్చేయాలి... కానీ ఇన్ని రోజులయినా రాలేదు కాబట్టి ఇంక ఎన్నిరోజులు పడుతుందో చెప్పలేం. సమీప భవిష్యత్తులో బైటికి రాకపోవచ్చు కూడ. ఇంకొక

రెండు రోజులు ప్రయత్నం చేసి తరవాత అతన్ని వదిలేస్తాం. ఇంక ఏం జరిగినా భరించక తప్పదు కదా! ఆ తూటాలు అతని కడుపులో ఉన్నంతకాలం అతను నన్ను బ్లాక్‌మెయిల్ చెయ్యగలడు. ఆ శూరభద్రుడేమో ఎప్పుడు ఫోన్ చేసినా నేను దొరకడం లేదని మండిపడుతున్నాడు. ఎంత విషమ పరిస్థితి ఏర్పడిందో చూడండి. ఈ పని చేయడం కంటె రాజీనామా చేసి ఎలక్షన్లో నిలబడడమే మంచిది. ఓడిపోయినా కూడ సమాజంలో నాకు ఈ రోజున్న విలువకంటె ఎక్కువే ఉంటుంది కదా! కనీసం పదిమంది రాజకీయ నాయకులతో భుజం భుజం రాసుకొని తిరగొచ్చు కదా!''

అప్పటివరకు భాస్కరుడి కోసం బాధపడిన శ్యాంబాబు సానుభూతి ఇప్పుడు దొరబాబు వైపుకి ప్రవహించడం మొదలు పెట్టింది. ఈ పోలీసు ఉద్యోగం ఎంత కష్టమయింది? ''దయ్యానికీ అగాధ సముద్రానికీ మధ్య ఇరుక్కున్నట్లు'' అన్న ఇంగ్లీషు సామెతగా ఈ దొరబాబు పరిస్థితి ఎంత దయనీయంగా ఉంది?

శ్యాంబాబు మళ్ళీ మళ్ళీ భాస్కరుణ్ణీ, దొరబాబునీ కలిశాడు. ఇంకో చిన్న దొంగను శూరభద్ర మంత్రి ముందు హాజరు పెట్టారనీ అతన్ని జైలుకు పంపాక ఆ గొలుసును కోర్టునుంచి తీసుకుని చాలా సంతృప్తుడయ్యాడని దొరబాబు రిపోర్టు చేశాడు. ఆ ఏడు రోజుల్లో భాస్కరుడితో అబద్ధం చెప్పించడానికి చేసిన ప్రయత్నాలకు దొరబాబు జేబుకు అయిన ఖర్చు రూ.3,500/-. అతన్ని వదిలిపెట్టేటప్పుడు చేతిలో ఒక వెయ్యి రూపాయలు పెట్టినట్టుకూడా దొరబాబు చెప్పాడు. తరవాత అప్పుడప్పుడు భాస్కరుడు వచ్చి తనముందు తలగోక్కుంటూ నిలబడినప్పుడల్లా యాభయ్యో, వందో ఇస్తూనే ఉన్నానని వివరించాడు. అంతేకాక ఏ పోలీసు పార్టీ భాస్కరుణ్ణి దొరకబుచ్చుకున్నా అతన్ని విడిపించడానికి కూడ తానే జోక్యం కలిగించుకోవలసిన తన శనిదశ వైపరీత్యాన్ని గురించి కూడ అతను తెలిపాడు.

కొంతకాలం తర్వాత భాస్కరుణ్ణి మళ్ళీ యక్స్-రే తీసి చూడాలనీ, మిగిలిన ఆరెండు తూటాలు కూడా బైటికి వెళ్ళిపోయాయని తెలిస్తేనే తనకు జీవన్ముక్తి లభిస్తుందని ఆయన వ్యక్తం చేశాడు.

ఆ రోజుల్లోనే ఒకసారి భాస్కరుడు శ్యాంబాబును కలిసి మిగిలిన రెండు తూటాలు బైటికి వచ్చేశాయనీ, అయితే మొట్టమొదట బైటికి వచ్చిన తూటాను పోలీసువాళ్ళ దృష్టి తగలకుండ రహస్యంగా ఉంచాననీ అతను చెప్పాడు. కానీ ఎప్పటివరకు రెండు తూటాలు తన కడుపులో ఉన్నాయని దొరబాబు నమ్ముతాడో అప్పటివరకు అతని అభయహస్తం తనకు ఉంటుందన్న ఆలోచనతో ఆ ఇన్స్పెక్టరుకు నిజస్థితి తెల్పడం లేదని ఒక దొంగ

నవ్వుతో, చిలిపి తనం దాగుడు మూతలాడే కళ్ళతో అతను చెప్పాడు. ఇంకా పోలీసు వాళ్ళ గురించి చాలానే చెప్పాల్సి ఉందని కూడ అన్నాడు. పోలీసుల్లో మంచి వాళ్ళు ఉన్నా, అతి చండాలురు కూడ ఉన్నారని... చౌకరకం దొంగలకంటె చౌకయిన ఖాకీ వాళ్ళు కూడా ఉన్నారని భాస్కరుడి అభిప్రాయం. దొంగతనం చేసి బంగారం తెమ్మని కొందరు ఆదేశిస్తారు. వాళ్ళు చెప్పింది చెయ్యకపోతే అది తన ఆరోగ్యానికి మంచిది కాదు. వాళ్ళలో కొంతమంది అలా ఆదేశించేది ప్రజల శ్రేయస్సు కొరకే. ఎందుకంటే, కొన్ని పోలీసు స్టేషన్లలో కొన్ని కేసులకు దొంగలు దొరకలేదనుకోండి. అప్పుడు ఆ ఫిర్యాదుదారుల ఒత్తిడి బాధను భరించడమే కాక వాళ్ళ కన్నీటిని కూడ చూడవలసి వస్తుంది. ఆ ఫిర్యాదు దార్లకు దొంగను జైలుకు పంపాలన్న ఉద్దేశమే ఉండదు. వాళ్ళు పోగొట్టుకున్న డబ్బులోగాని, బంగారంలో గాని కొంచెం దొరికినా వాళ్ళకు కొంతవరకు క్లేశప్రశమనం అవుతుంది. ఆ రకంగా వాళ్ళ కన్నీరు చూచి మన మనస్సు కరిగి కొంతమంది సబ్ ఇన్స్పెక్టర్లు ఎక్కువ ఆభరణాలు పెట్టుకొని తిరుగుతున్న అమ్మాయిల మెడల్నించి గొలుసులు లాక్కొని రమ్మని పురమాయిస్తారు. లక్ష్యం మాట నిజమయితే ఇలా ప్రవర్తించడంలో తప్పు లేదని భాస్కరుడి అభిప్రాయం.

ఇంకా కొంతమంది పోలీసువాళ్ళయితే తాను తెచ్చిన బంగారపు వస్తువుల్ని తాను తూటాలు మింగినట్లుగా మింగుతారు అని అతను చెప్తుంటే శ్యాంబాబు నవ్వకుండా ఉండలేకపోయాడు. అలాంటివాళ్ళల్లో ఒక పెద్ద ఆఫీసరు కూడ ఉన్నాడు అని చెప్పినపుడు శ్యాంబాబు ఎంత అడిగినా అతని పేరు చెప్పలేదు. ఆ పెద్దవాడి పేరే కాదు అతను ఏ పోలీసాఫీసరు పేరుకూడ బైట పెట్టడు. అతన్ని చంపుతానన్నా చెప్పడు. అతనికి పోలీసు వాళ్ళవల్ల ఎలాంటి కష్టనష్టాలు కలిగినా ఒక్క పోలీసువాడికి కూడ తనవల్ల ఎలాంటి కష్టం కలగకూడదని అతని అభిమతం.

''సార్! మనం సుఖంగా నిద్రపోవడానికి నిద్రలేకుండ కష్టపడేవాళ్ళు ఈ పోలీసువాళ్ళు ప్రజల మాన, ధనాలు కాపాడ్డానికి తమ ప్రాణం కూడ త్యాగం చేసేవాళ్ళు వాళ్ళు సార్. అలాంటి డిపార్ట్‌మెంట్‌లో మంచివాళ్ళుండవచ్చు, చెడ్డవాళ్లుండవచ్చు. కానీ ఆ డిపార్ట్‌మెంట్ మొత్తాన్ని సమర్థించవలసిన నైతికబాధ్యత మనందరిదీ...''

ఇదంతా విన్న శ్యాంబాబుకు చాలా ఆశ్చర్యం కలిగింది. కానీ దొంగ భాస్కరుడు వెళ్ళిం తర్వాత ఛటుక్కున ఒక అనుమానం వచ్చింది. వీడి దుంపతెగ! 'నైతిక బాధ్యత మనందరిదంటాడేంటి? ఆ దొంగల బహువచనంలో నన్నూ కలిపేశాడా? లేక అందరం దొంగలే నన్న పరమసత్యాన్ని నర్మగర్భంగా చెప్పి వెళ్ళాడా? ★